


వివరాలు లోపలి పేజీలలో

**సిపిఐ వైపు గ్రామ రాజకీయాల మలుపు - రత్తిపల్లిలో చేరికల జోరు**


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 09 ఏప్రిల్ , 2026 | పేజీలు : 05


# పేదలకు మెరుగైన వైద్యం లక్ష్యం

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### మాన్యం చెల్కలో రూ.1.91 కోట్ల వ్యయంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రజాపాలప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని మాన్యం చెల్కలో రూ.1.91 కోట్ల వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేంద్రం ద్వారా మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాలు, డాక్టర్ల నియామకం చేపట్టినట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని మెడికల్ ఎక్విప్‌మెంట్ అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.ప్రజలు, ముఖ్యంగా పెద్దవారు, గర్భిణీ స్త్రీలు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని, అవసరమైన పరీక్షలు ఇక్కడే చేసి అవసరమైతే ప్రధాన ఆస్పత్రికి రిఫర్ చేసేలా సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. మందులు అందుబాటులో లేకపోతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రైవేట్ మెడికల్ షాపుతో అనుసంధానం చేసి అత్యవసర మందులు అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ కేంద్రం పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సాగర్ కుడి కాలువలో విషాదం

## తల్లి, చిన్నారి మృతి





**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ కుడి కాలువలో ఓ వివాహిత తన చిన్నారి కుమార్తెతో కలిసి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.స్థానికుల సమాచారం ప్రకారం, మహిళ తన కుమార్తెతో కలిసి కాలువలోకి దూకినట్లు చెబుతున్నారు. ఈ సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహిళ వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండగా, చిన్నారి వయస్సు సుమారు 3 సంవత్సరాలుగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై విజయపురి సౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుల గుర్తింపు, వారు ఏ ప్రాంతానికి చెందినవారు, ఈ ఘటనకు దారితీసిన కారణాలు తదితర అంశాలపై విచారణ కొనసాగుతోంది. మృతులను ఎవరైనా గుర్తిస్తే నాగార్జునసాగర్ విజయపురి సౌత్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# సీఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులు పెంచాలి

## పూర్తి స్థాయిలో వైద్య ఖర్చులు భరించాలి: ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులను పెంచి, బాధితులకు పూర్తి స్థాయిలో వైద్య ఖర్చులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మునుగోడులోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు చాలామంది అప్పులు చేసి చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, బొలుగురి నరసింహ, మండల కార్యదర్శి చాపల శ్రీను, సురిగి చలపతి, బొమ్మరబోయిన లాలు, ఈదులకంటి కైలాస్, పందరి, శంకర్, గోల్కొండ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పివి టీకా కీలకం

## కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పివి టీకా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు నిర్వహిస్తున్న హెచ్‌పివి టీకా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. 14 నుండి 15 సంవత్సరాలలోపు ఉన్న బాలికలు తప్పనిసరిగా ఈ టీకాను తీసుకోవాలని సూచించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణలో ఈ వ్యాక్సిన్ ప్రభావవంతంగా పనిచేస్తుందన్నారు. బాలికల ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని హెచ్‌పివి టీకా వేయించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. జిల్లాలో 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల మొత్తం 11,664 మంది బాలికలను గుర్తించినట్లు తెలిపారు. వీరందరికి హెచ్‌పిఓ టీకా అందించే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ చేపట్టిందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో టీకా వేస్తారని సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రవీందర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, వైద్యులు ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, ఆనంద్, డిడబ్ల్యుఓ నర్సింహారావు, డిఈఓ అశోక్, డిప్యూటి డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, మాధవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టిఏసి సమావేశంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన గిరిజన సలహా మండలి (టిఏసి) సమావేశంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అటవి ప్రాంత సమస్యలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. నాగార్జునసాగర్ వెనుక జలాల తీరాన ఉన్న వైజాగ్ కాలనీ ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు ప్రస్తుతం నిలిచిపోయాయని, వాటిని తక్షణమే పున ప్రారంబించాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక గిరిజన యువతకు ఉపాధి పెరగడమే కాకుండా, దేవరకొండ పర్యాటక హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను, ఇతర అటవీ సంబంధిత ఇబ్బందులను కమిటి దృష్టికి తీసుకెళ్ళి వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దేవరకొండ అటవీ ప్రాంతంలోని సహజ సిద్ధమైన ప్రదేశాలను గుర్తించి, మరిన్ని కొత్త పర్యాటక ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఏలు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## సిబ్బంది కుటుంబాలకు బాసటగా పోలీస్ భద్రత స్కీమ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దివంగత సిబ్బంది కుటుంబాలకు పోలీస్ భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుందని జిల్లా ఎస్పి కె. నరసింహా అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ ఇటీవల అకలంగా మృతి చెందారు. మృతి చెందిన ఏఎస్ఐ కుటుంబానికి పోలీసు భద్రత స్కీం నగదు చెక్కును బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. పోలీసు శాఖలో పనిచేస్తూ అకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. సత్యనారాయణ కుటుంబ సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజి సైదులు అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితులకు అనేక హామిలు ఇచ్చి ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదని అన్నారు. వెంటనే ప్రభుత్వం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నూకపంగు కాశయ్య, చీమలపాటి వెంకటయ్య, పరంగి రంజిత్, అందుగుల లక్ష్మ ణ్, కొండేటి మధు, ఏర్పుల వెంకన్న, ఎడ్ల నాగరాజు, పాలడుతు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, సిహెచ్ఓ బిచ్చు నాయక్, ఏఎన్ఎంలు గిరిజ, శకుంతల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్స్, చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్‌వాడి టీచర్లకు 194 సెల్‌ఫోన్లను, చిన్నారులకు యూనిఫాంలను బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలకు లబ్దిదారులైన గర్భిణీలకు, బాలింతలకు, ఆరు నెలల నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులకు, అదేవిధంగా 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు సంబంధించిన ప్రతి డేటాను ఎన్‌హెచ్‌టీఎస్, పోషన్ ట్రాకర్ యాప్‌లో పొందుపరచడానికి ప్రభుత్వం సెల్‌ఫోన్లు అందించినందున వారికి పంపిణి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రాజెక్టు పరిదిలోని 211 అంగన్‌వాడి కేంద్రాల్లోని అంగన్‌వాడి చిన్నారులకు యూనిఫాంలు అందించడం జరిగందన్నారు. ఏ లక్ష్యంతో ప్రభుత్వం సెల్‌ఫోన్లు అందిస్తుందో ఆ లక్ష్యం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రేఖల మమత, సూపర్‌వైజర్లు రాధిక, నాగమణి, నజీమాబేగం, వాణి, హేమాదేవి, పద్మ,నిహారిక, అంగన్‌వాడి టీచర్లు బొందు పార్వతి, ఇంద్రపల్లి సైదమ్మ, ప్రమీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్, పీస్ రేట్ కార్మికుల సమ్మె ప్రారంభం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ ఆర్టిజన్, పీస్ రేట్ కార్మికుల నిరవధిక సమ్మె బుధవారం ప్రారంభమైంది. మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ ఆర్టిజన్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సిబ్బంది తమ విధులు బహిష్కరించి విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కార్యదర్శి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కార్యదర్శి నర్సింగ్‌రాము, అధ్యక్షుడు నెమలి ఆదిరెడ్డిలు మాట్లాడుతూ వారి విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, వారికి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. విద్యుత్ సంస్థలో అన్ని రకాల అర్హతలు కలిగి ఉండి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఆర్టిజన్‌గా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, హాలియా సబ్ డివిజన్ నాయకులు బైరం అశోక్, వల్లంపట్ల మధు, 1104 కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు షఫిఖాన్, 327 కార్యదర్శి రాజేశ్వర్‌రావు, అధ్యక్షులు వై.ఆంజనేయులు, టీఆర్‌వీకేఎస్ కార్యదర్శి సైదులు, ఓసీ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎండి.రిజ్వాన్, ఎస్సీ, ఎస్టీ సంఘం డివిజన్ నాయకులు దైద వెంకటరత్నం, సీపీఎం, సీఐటీయూ నాయకులు మల్లేష్, రవినాయక్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు నామినేటెడ్ పదవుల్లో 50శాతం అవకాశం కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు త్వరలో రాష్ట్రంలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో 50శాతానికి పైగా అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. బుధవారం ఆయన హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సందర్భంగా బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు అడిగితే గెలుపు గుర్రాలకు టికెట్లు ఇస్తామని చెప్పి బీసీలకు ఎక్కువ టికెటుల ఇవ్వలేదని, అదికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పి ఇప్పుడు అది కూడా చేయడం లేదని, ఏదో తూతూ మంత్రంగా ప్రాధాన్యత లేని పదవులను బీసీలకు కట్టబెడుతూ కేవలం ఒకే ఒక కులానికి అన్ని పదువులు కట్టబెడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో 50శాతంకు పైగా మున్సిపల్ కౌన్సిలర్లును, చైర్మన్‌లను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యతన ఇస్తానని అన్నారు. కార్యక్రమంలో బొల్లేపల్లి స్వామిగౌడ్, ఏకుల లక్ష్మి అమృతం, కుర్మటి రాకేష్, కిన్నెర ప్రభు, నక్క శ్రీశైలం యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో విధులు బహిష్కరించి న్యాయవాదుల ఆందోళన



**ప్రజాపక్షం/కోదాడ:** ఎపిలో యువ న్యాయవాది పూజారి ఎల్లయ్య హత్యను నిరసిస్తూ బుధవారం కోదాడలో న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. హత్యకు కారకులైన వారిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని న్యాయవాది కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమీటని వారు ప్రశ్నించారు. ఎపి ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని పాస్ట్‌కోర్టు ద్వారా విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, కోశాధికారి కోడూరి వెంకటేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీ గాలి శ్రీనివాసనాయుడు, సీనియర్ న్యాయవాదులు నాగార్జున, సుధాకర్‌రెడ్డి, రంగారావు, కాకర్ల వెంకటేశ్వర్లు, హేమలత, రంజాన్‌పాషా, నాగుల్‌పాషా, హనుమంతరావు, పెద్దబ్బాయి, అబ్దుల్ రహీం, ఉయ్యాల నర్సయ్య, రియాజ్, తాటి మురళి, రమేష్ బాబు పాల్గొన్నారు.



## బత్తాయి రైతుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బత్తాయి రైతు పరస్పర సహాయక సహకార సంఘం, ప్రతిభ బయోటెక్ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన బత్తాయి రైతుల అవగాహన సదస్సులో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని రైతులతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో బత్తాయి రైతులు సాగు చేయడంలో, అమ్ముకోవడంలో ఇబ్బందులు వచ్చిన మాట వాస్తవమే ఎందుకంటే బత్తాయి రైతును కాబట్టే సమస్యలు కూడా తెలుసన్నారు. ఎమ్మెల్యేగా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయే విషయంలో ఎప్పుడూ ముందంజలో ఉంటానని మాటిస్తున్నానని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సంఘంగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక పంట పట్ల ప్రజలను ఏకం చేసి ఒక సంఘాన్ని నిర్మించడం బత్తాయి రైతులకు గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బత్తాయి రైతులు పాల్గొన్నారు.

## ముఖ గుర్తింపు ఒక్కసారి చాలు



**ప్రజాపక్షం/చిట్యాల:** ఉపాధి హామీ కూలీలకు రెండు మార్లు తీసుకునే ముఖ గుర్తింపు స్కానింపులో ప్రభుత్వం మార్పులు తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. పనులు మొదలయ్యేపుడు, ముగింపు సమయంలో రెండు సార్లు ముఖ గుర్తింపు స్కానింగ్ కారణంగా కార్మికులు ఇబ్బందులకు గురౌతున్నారని వాపోయారు. నెట్‌వర్క్‌లో సమస్య వచ్చినపుడు ముఖ గుర్తింపు జరగటం లేదని, దాని వల్ల వారి హాజరు శాతం తక్కువై వేతనాలు తక్కువగా పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు కత్తుల లింగస్వామి పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామంలో రైతులు సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేసిన మొక్కజొన్న పంటకు వర్షాలు భారీన నష్టపోకుండా రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా మొక్కజోన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నర్సింహులగూడెం సర్పంచ్ కుంచం ఇందిర నర్సయ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌కు కలెక్టర్ కార్యాలయంలో కలిసి రైతులతో పాటు కొనుగోలు కేంద్రాన్నిఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి వెంటనే మార్క్‌ఫెయిడ్ ఎండితో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వరికి ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న పండిస్తున్న నర్సింహులగూడెం రైతులను కలెక్టర్ అభినందించారు. ఉప సర్పంచ్ మొగిలిచర్ల సీతరాములు, మాజీ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోట గోపి, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.





## క్షయవ్యాధి రహితమే టివి ముక్త్ భారత్ లక్ష్యం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** 2030 నాటికి భారత దేశం అంతటా క్షయ వ్యాధి రహితంగా మార్చడమే టిబి ముక్త్‌భారత్ లక్ష్యంమని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో చాతి ఎక్స్‌రే శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్స్‌రే శిబిరంలో 80 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 5, 6వ వార్డు కౌన్సిలర్లు యరగాని సుష్మ మురళి, శీలం నాగమణి శ్రీనివాస్, టిబి కోఆర్డినేటర్ ప్రసాద్, మాధవరెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ శివ, ఆరోగ్య కార్యకర్తలు, ఇందిరాల రామకృష్ణ, బండారు కవిత, గండు ప్రశాంతి, సూపర్‌వైజర్ మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఉచిత కంటి వైద్య శిభిరమును గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిభిరం నిర్వహించారు. గ్రామంలోని 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను, మందులను పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి సూర్యాపేటలో లయన్స్‌క్లబ్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, సిగ నజీర్, నరసింగ కృష్ణమూర్తి, కాజా విజయ వెంకటేశ్వర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆదివారం సెలవు ఇవ్వాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపల్ కార్మికులకు చట్ట ప్రకారం వర్తించే ఆదివారం సెలవు ఇవ్వాలని బిఆర్‌టియు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ అన్నారు. బుధవారం పట్టణంలోని రైతుబజార్ వద్ద పట్టణ మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా రెయనక పగలనక ఎర్రటి ఎండను సైతం భరిస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్న మున్సిపల్ కార్మికుల వేతనాలను ప్రభుత్వం ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కార్మికులకు చట్టప్రకారం రావల్సిన హక్కులు, ఆదివారం సెలవులు, పండుగ రోజుల్లో గతంలో 9 గంటల వరకు పనిచేసే వారని అన్ని హక్కులు లేకుండా రాకుండా మున్సిపల్ కమీషనర్ చేయడం ఏమిటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటాద్రి, నాగేశ్వరరావు, శ్వేత, కుమారి, సువార్త, కళమ్మ పాల్గొన్నారు.



# ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్ ఉద్యోగస్తులు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ ప్రారంభించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించచారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వేసవి కాలంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని, అందుకే తాగు నీటి సౌకర్యాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ చల్లని తాగునీరు అందేలా ప్రత్యేకంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. ఏవో మోతిలాల్ సూపర్డెంట్ కృష్ణమూర్తి ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లు సీజ్...



**ప్రజాపక్షం/డిండి;** మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను బాపన్ కుంట సమీపంలో డిండి సిఐ బీసన్న, ఎస్ఐ బాలకృష్ణలు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్లకు ఎస్కార్ట్‌గా వస్తున్న రెండు బైక్‌లను, వ్యక్తులను, ట్రాక్టర్లు నడుపుతున్న వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసులు నమోదు చేసి, పట్టుబడిన రెండు ట్రాక్టర్లు జేత్య తండా, రెండు ట్రాక్టర్లు ప్రతాప్ నగర్ గ్రామానికి చెందిన సీజ్ చేసి వారిపై తదుపరి చర్యలకై మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు పంపంపి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని సిఐ బీసన్న తెలిపారు.

## విద్యార్థులు ప్రపంచం గర్వించే గొప్ప ఆవిష్కర్తలుగా ఎదగాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ, విద్యార్థులు ప్రపంచం గర్వించే గొప్ప ఆవిష్కర్తలుగా ఎదగాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు ఆకాంక్షించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖి లోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బుధవారం 'ట్రినెక్సియా 2026' పేరుతో టెక్ ఫెస్టు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు మాట్లాడుతూ నేటి యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సూచించారు. కాగా 'ట్రినెక్సియా 2026' టెక్ ఫెస్ట్ విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టింది. ఈ టెక్ ఫెస్ట్లో ప్రధానంగా ఐడియాథాన్, ఈస్పోర్ట్స్, టెక్ పల్స్, డీబగ్గింగ్ ఛాలెంజ్, బ్లిట్జ్ అనే ఐదు అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిభ చాటిన విజేతలకు మొత్తం ₹25,000కు పైగా నగదు బహుమతులతో పాటు మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించడం జరిగింది. ఈ హెల్త్ క్యాంపులో బిపి, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి, అవసరం అయిన వారికి ఉచితంగా మందులను అందజేశారు. సర్పంచ్ మద్దెపురం కొండమ్మ పరశురాములు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా ఉన్న పిఏసిఎస్, ఐకెపి కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి రైతులను ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు విజయ్ భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులతో కలిసి ఆయన సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు సురేష్, దయాకర్, మండల నాయకులు శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.





## విద్యార్థికి సైకిల్ బహుమతి

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో పాఠశాల ప్రథమ స్థానాన్ని సాధించిన విద్యార్థికి గ్రామానికి చెందిన సమ్మక్క నర్సిరెడ్డి, సమ్మక్క రంగారెడ్డి సోదరులు సైకిల్‌ను అందజేశారు. 2024/2025 విద్యా సంవత్సరంలో గ్రామానికి చెందిన డి అభిజ్ఞాన హర్షవర్ధన్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుకొని పాఠశాల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రథమ ర్యాంకును సాధించాడు. విద్యా రంగంలో విద్యార్థులను ప్రోత్సహించాలన్న నెపంతో గ్రామానికి చెందిన స్వర్గీయ సమ్మక్క బక్కారెడ్డి, జంగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు విద్యార్థికి సైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలెం మహేష్, హైస్కూల్, ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బండ మోహన్‌రెడ్డి, గరిసె అంజయ్య పాల్గొన్నారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ నిధులతో దాదాపు రూ.20లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి ప్రారంభించారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో చింతలపాలెం గ్రామాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధి విషయంలో మొదటి స్థానంలో ఉంచుతానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జంగాల అనంతమ్మ పుల్లయ్య, నాయకులు మోర్తాల వెంకట్‌రెడ్డి, కందుల సుందర మౌలేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## 9న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి

ప్రజాపక్షం/రామన్నపేట : పేద మధ్యతరగతి విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, 9న జరిగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 14 లక్షల మంది ఎస్సీ,ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని మునిగే నక్కపై తాటికాయ అన్న చందంగా హైకోర్టు ప్రైవేటు యాజమాన్యాలకు తివాచీపరిచే విధంగా విద్యార్థుల నుండి నిర్బంధంగా వసూలు చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం పేద విద్యార్థులపై పెనుభారంగా మారిందని,ఈ సాకుతో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయన్నారు.ప్రైవేటు కళాశాలలో ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారన్నారు.ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు కనీసం ప్రభుత్వాన్ని విద్యార్థుల పక్షాన మాట్లాడి గొంతు విప్పే పరిస్థితి లేదని ప్రభుత్వంలో చలనం తీసుకువచ్చేందుకు శాసనసభ్యుల క్యాంపు కార్యాలయాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని,ఈ ధర్నాకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని కోరారు.



## మతిన్‌కు సత్కారం

**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ మైనారిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన మతిన్‌ను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మతిన్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యత అప్పగించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానన్నారు. సమాజ ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తూ యువతకు విద్య, ఉపాధి అవకాశాలపై దృష్టి సారిస్తానని చెప్పారు. తనకు సహకరించిన కుల పెద్దలు, ముఖ్య నాయకులు ఎజాస్, రఫీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌగోని శ్రీనివాస్,పన్నాలరాఘవరెడ్డి ,లింగాల వెంకన్న, యాసారపు వెంకన్న పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు పట్ల హర్షం

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండలంలో నూతన గ్రామ పంచాయతీ పెద్దబాయి శాఖంపల్లికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయించడం పట్ల పెద్దబాయి శాకంపల్లి సర్పంచ్ వేల్పుల రజిత శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యవసాయ రంగంపై అవగాహన



**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : విద్యార్థులకు చదువుతోపాటు వ్యవసాయ రంగం పైన అవగాహన ముఖ్యమని మాజీ ఎంపీటీసీ మాందాల రామస్వామి అన్నారు. మండలంలోని సోలిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దియా ఫౌండేషన్ ఫౌండర్ కమలాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంటలు రైతుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పావని ఇంద్రసేనారెడ్డి, ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి, ఉప సర్పంచ్, శిరీషరాజుయాదవ్, వార్డు మెంబర్లు పూదూరి ఆంజనేయులు గౌడ్, ధీరావత్ స్వామి నాయక్, రమేష్ నాయక్, చిలిమిళ్ళ మమతా మహేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## సురక్షిత మాతృత్వం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది హెల్త్ వీక్ లో భాగంగా గర్భిణీ స్త్రీలకు సురక్షిత మాతృత్వం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంఎల్‌హెచ్ పి.జ్యోతి, ఎంపిహెచ్ఏ అరుంధతి, ఎంపిహెచ్ఏ సునీత, ఆశ వర్కర్‌లు బాలమణి, వరమ్మ, శ్యామల పాల్గొన్నారు.



# నీటి పారుదల డిఇకి గ్రామ రైతులతో కలిసి వినతి



**ప్రజాపక్షం/రామన్నపేట** : అసీఫ్ నహర్ కాల్వకు నీటిని నిలుపుదల చేసి విస్తృతంగా పెరిగిన గుర్రపు డెక్క ఆకును తొలగించి మునిపంపుల గ్రామంలో శిథిలావస్థకు చేరిన కాల్వ కట్టను మరమత్తు చేయాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. గ్రామ రైతులతో కలసి చిట్యాల నీటి రుదల డిఇ కార్యాలయంలో సెక్షన్ అధికారి శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అసిఫ్ నగర్ కాలువ గత పది సంవత్సరాలుగా నిరాటంకంగా ప్రవహిస్తుండడంతో గుర్రపు డెక్క ఆకు ఏపుగా పెరిగి కాలువను మొత్తం ఆవరించి ప్రమాదకరంగా మారిందని,అధిక ప్రవాహం వచ్చినప్పుడల్లా నీరు కట్ట మించి తరలిపోయి పలుసార్లు కట్టలు కూడా తెగిన సందర్భాలు ఉన్నాయని దీని మూలంగా తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. నీటిపారుదల డిఇ సునీత నందను ఫోన్లో సంప్రదించగా త్వరలో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతికుమార్, మాజీ ఉపసర్పంచ్ మామిడి పాండురెడ్డి,గ్రామ రైతులు మన్నెం,పద్మారెడ్డి,కల్లూరి రవి కుమార్,మేకల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం



**ప్రజాపక్షం/మోటకొండూర్** : గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని తేర్యాల సర్పంచ్ మంత్రి లతా స్వామి అన్నారు. వారు బుధవారం తేర్యాల లో స్ట్రీట్ కాస్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ సాత్విక, కో ఆర్డినేటర్ బూరెడ్డి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో కంప్యూటర్,సిపియు, ప్రింటర్,అంగన్వాడి కేంద్రంలో పిల్లలకి ఆట వస్తువులు, మహిళా సంఘాలకు కుర్చీలు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ బృందం సభ్యులు, ఉప సర్పంచ్ బాజ మోహన్, వార్డు కొలనుపాక రమ్య దుర్గయ్య,పీల్ అసిస్టెంట్ ఉస్మాన్, గ్రామపంచాయతీ కారోబార్ ఇంద్రాల రామ చంద్రు, అంగన్వాడీ టీచర్ రేణుక, మరాఠి మల్లయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత అందరిది



**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : ప్రైవేట్ పాఠశాలల మాయాజాలంలో పడి కన్నతల్లి లాంటి ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేయడం తగదని ప్రభుత్వ పాఠశాలల మనుగడ తో పాటు ప్రభుత్వ పాఠశాల పూర్వ విభాగానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని మండలంలోని సోలిపేట గ్రామ సర్పంచ్ చిలువేరు పావని ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ వ్యవస్థ మన ఊరు మనబడి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపసర్పంచ్ శిరీష రాజు యాదవ్, వార్డు మెంబర్లు ఆంజనేయులు గౌడ్, స్వామి నాయక్, రమేష్ నాయక్, సెక్రటరీ శ్రీనివాస్, కరోబార్ భాగ్య పాల్గొన్నారు.

## దశదినకర్మలో పాల్గొన్న సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/బీబీనగర్** : స్వాతంత్ర సమరయోధులు భువనగిరి ప్రాంత కమ్యూనిస్టు నాయకులు దివంగత జంగ ఎల్లయ్య సతీమణి జంగ లక్ష్మమ్మ దశదిన కర్మ బుధవారం బీబీనగర్ మండలంలోని రాఘవపురం గ్రామంలో జరిగిన సందర్భంగా వారి చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, బీబీనగర్ మండల కార్యదర్శి కాశపాక దయాకర్‌తో పాటు వారి కుమారుడు సూర్య ప్రకాష్ మరియు కుటుంబ సభ్యులు వారి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ బీబీనగర్ మండలంలోని రాఘవపురం గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు కీర్తిశేషులు జంగ ఎల్లయ్య తన జీవితాంతం ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం పనిచేశారని వారితోపాటు వారు సతీమణి కుటుంబ సభ్యులు కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్నారని వారి సేవలు చిరస్మరణీయమని వారి ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. వారి వెంట గొల్లకొండ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాల బిడ్డలను కన్న సుశీలమ్మకు నివాళులు



**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రజా ఉద్యమాల బిడ్డలను కన్నతల్లి కనుకుంట్ల సుశీలమ్మ చిత్రపటానికి బుధవారం రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. దూదిమెట్ల రాజేశ్వరి బాలరాజు యాదవ్ నివాళులు అర్పించారు. సమసమాజ స్థాపన కోసం అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న సుశీలమ్మ జీవితాంతం సేవా భావంతో పనిచేశారని తెలిపారు. మరణానంతరం కళ్లదానం చేసి, వైద్య విద్యార్థుల కోసం తన భౌతిక కాయాన్ని దేహదానంగా అర్పించడం ఆమె మహోన్నత సేవాస్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సుశీలమ్మకు భర్త కనుకుల శంకర్ రెడ్డి, కుమారులు సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి కుటుంబ సభ్యులకు డా. బాలరాజు యాదవ్ కుటుంబ సభ్యులను ఓదార్చి తన సంతాపం వ్యక్తం చేశారు.



## అవినీతిని అంతం చేయడమే ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్** : అవినీతిని అంతం చేసి కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు వైద్యం అందే విధంగా పోరాటం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు యార శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యారా శ్రీను మాట్లాడుతూ అమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు సైనికులు లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఆమ్ ఆఫ్ ది పార్టీ సభ్యత్వాలను పెద్ద ఎత్తున చేర్పించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో అమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యూసుఫ్,జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రవి, శ్రవణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జహంగీర్ కుటుంబానికి నివాళి



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రముఖ తెలంగాణ ఉద్యమ గాయకులు ఎండి జహంగీర్ ఇటీవల ఆకాల మరణం చెందగా వారి కుటుంబ సభ్యులను శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్, ప్రముఖ జర్నలిస్టు విరాహత్ అలీ, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం జహంగీర్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పించి చాదర్ సమర్పించారు. ప్రజా గాయకుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల వైపే అడుగులు



**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్యతో పాటు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మండల విద్యాధికారి మేక నాగయ్య కోరారు. బుధవారం నకిరేకల్ మండలంలోని వల్లభాపురం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొర్సు శ్రీను, ఏఏపీసీ చైర్మన్ టీ.సరిత,వార్డు సభ్యుడు టీ. కాంతి ఉమర్,అంగన్‌వాడీ టీచర్ ఎం.పద్మ పాల్గొన్నారు.

## ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/నకిరేకల్:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నకిరేకల్ పట్టణ కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఖర్గే చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆయనపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా సైలెన్సర్ వినియోగిస్తే క్రిమినల్ కేసులే

## 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్ల రోడ్ రోలర్ ద్వారా ధ్వంసం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సైలెన్సర్ మార్పిడి చేసి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అడిషనల్ జి. ఎస్‌పి రమేష్ హె చ్చరించారు.బుధవారం నల్లగొండ పట్టణంలోని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, శబ్ద కాలుష్య, వాయు కాలుష్యం నియంత్రణలో భాగంగా పర్యావరణ రక్షణ కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, ఆదే శాల మేరకు గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహన దారులు మాడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగించి అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ క్రమంలో సుమారు 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి వాటిని తొలగించి, పట్టణంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద రోడ్ రోలర్ ద్వారా ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ ద్వారా అందించిన ఒరిజినల్ సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. సైలెన్సర్లలో అనుమతి లేకుండా మార్పులు చేసి అధిక శబ్దం కలిగించే విధంగా ఉపయోగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించినట్లయితే, అట్టి వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, 2 టౌన్ సీఐ రాఘవ రావు,ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టు టౌన్ ఎస్ఐ సైదులు,రూరల్ ఎస్.ఐ సైదా బాబు, కనగల్ ఎస్. ఐ రాజీవ్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/తిప్పర్తి:** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లి తానుదారుపల్లి , రామలింగాల గూడెం, గడ్డికొండారం , మామిడాల , గోదావరి గూడెం ,సర్వారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, తిప్పర్తి తహసీల్దార్ రాచకొండ రామకృష్ణ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మండలాపురం, బైరెడ్డిగూడెం గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దండి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండా వెంకట రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండల పరిధిలోని అల్వాల ,తిరుమలగిరి, సిల్కాపురం, రంగుండ్ల , కొంపల్లి, బోయ గూడెం, రాజవరం, నేతాపురం గ్రామాలలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, సర్పంచ్ పున్నమ్మ సైదులు యాదవ్‌లు బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సాగర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నిడమనూరు** :ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ చైర్మన్ అంకత సత్యం రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రం ఉండడం నోరు మార్కెట్ యార్డ్, ఆవరణలో మండల పరిధి వేంపాడు, వద్ద సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల



ఆధ్వర్యంలో మండల పరిధి మారుపాక, నందికొండ వారి గూడెం, గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఏపీఎం నరహరి,సిసి సైదులు, సీఈవో జానయ్య మారుపాక సర్పంచ్ చిత్రం సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని చిమిర్యాల పిఏసిఎస్ పరిధిలోని నల్లబండగూడెం సెంటర్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్ పద్మజ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లబండగూడెం సర్పంచ్ అలసకాని భవాని శరభశ్వరరావు, చిమిర్యాల సర్పంచ్ కొత్త గురవయ్య, దోరకుంట సర్పంచ్ పాలకి సురేష్, మంగల్‌తండ సర్పంచ్ ధరావత్ బాబ్జి, సిఇఓ జొన్నలగడ్డ కృష్ణ, మాజీ పిఏసిఎస్ చైర్మన్ కొత్త రఘుపతి, ఏఏఓ మహేష్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సురక్షిత మాతృత్వ పద్ధతులపై అవగాహన అవసరం

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సురక్షిత మాతృత్వ పద్ధతులపై అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన సురక్షిత మాతృత్వ పద్ధతులపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన నాటికను చూసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల పరీక్షల ప్రాముఖ్యత, సాధారణ ప్రసవాలు, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యతను వివరించారు. పిసిపిఎన్‌డిటి చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గర్భంలో శిశువు లింగ నిర్ధారణ నిషేధమన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు సరిపడా కుర్చీలు, త్రాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ




కార్యక్రమంలో డిఎంహెచ్ఓ వెంకటరమణ, మెడికల్ సూపరింటెండెంట్ జిజిహెచ్ శ్రావణ్ కుమార్, డిసిహెచ్ఎస్ గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, పిఓ ఎంహెచ్ఎన్, సిడిపిఓ పాల్గొన్నారు.

# సంఘమిత్ర స్టోర్స్ ఎన్నికల దిశగా ఓటర్ల తుది జాబితా సిద్ధం

**ప్రజాపక్షం / నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కన్స్యూమర్స్ కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ సభ్యుల ఓటర్ల తుది జాబితా సిద్ధమైందని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటయ్య తెలిపారు. 2025 డిసెంబర్ 31 నాటికి అర్హత పొందిన సభ్యులను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.సభ్యుల పరిశీలనార్థం ఓటర్ల జాబితాను పలు కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు వెల్లడించారు. పెదవూర మండల రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, నందికొండ మున్సిపాలిటీ కార్యాలయం, రైట్ బ్యాంక్ గ్రామ సచివాలయం, మాచర్ల మండల రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, అలాగే హిల్ కాలనీ, పైలాన్ కాలనీలలోని సంఘమిత్ర కార్యాలయాల నోటీసు బోర్డుల వద్ద జాబితా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేదా అభ్యంతరాలు ఉన్న సభ్యులు వాటిని లిఖితపూర్వకంగా ఏప్రిల్ 9, 2026 సాయంత్రం 5 గంటలలోపు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు సమర్పించాలని కోరారు. నిర్ణీత గడువు అనంతరం ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబడవని ఆయన స్పష్టం చేశారు.సభ్యులు జాబితాను పరిశీలించి తమ అభ్యంతరాలు, సూచనలు సమయానికి తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వట్టెపు సైదులు కోరారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు, సిఐటియుఆధ్వర్యంలో ఎంపిడివో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో వేతనాలను చెల్లించాలన్నారు. చాలిచాలనీ జీతాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వారికి కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. సాదా వెంకన్న, సిహెచ్ వెంకటి, వెంకయ్య, భగవాన్, సైదులు, భూలక్ష్మి , సంధ్య, ఊర్మిళ, కిరణ్, సైద, నాగరాజు, ఆనంద్, గోవిందరాజు పాల్గొన్నారు.

# మృతదేహానికి నివాళులు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దాసరి శ్రవణ్ కుమార్ రెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతుని ఇంటి వద్దకు వెళ్లి మృతదేవానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, సర్పంచులు అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

